సాక్షి
వికారాబాద్

శనివారం । 1 । జూలై । 2023



వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

తెలంగాణలో ఈసారి వచ్చే బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి అన్నారు. 10లో▸



చినుకు రాలక..

వానాకాలంలోనూ భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. నాటిన విత్తనాలు మొలవక రైతులు దిక్కుతోచకున్నారు. 11లో▸



రైతుల గోస పట్టని సర్కార్

రాష్ట్ర సర్కార్‌కు రైతుల సంక్షేమం పట్టడంలేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 11లో▸

సెంటర్లు 67
అభ్యర్థులు 18,120

నేడు గ్రూప్- 4 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 10 నుంచి 12:30 వరకు పేపర్- 1
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 వరకు పేపర్- 2
- బయోమెట్రిక్ హాజరు, సీసీ కెమెరాలతో నిఘా
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు



తాండూరు టౌన్: పరీక్షల బందోబస్తుపై సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ మురళీధర్

వికారాబాద్: జిల్లాలో శనివారం నిర్వహించనున్న గ్రూప్- 4 పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న పోటీ పరీక్షలను పకడ్బందీగా జరిపేందుకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో డీఆర్‌ఓ అశోక్‌కుమార్, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, డీఈఓ రేణుకాదేవి తదితరులు సెంటర్లను సిద్ధం చేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 67 సెంటర్లను ఏర్పాటు చేశారు. 18,120 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఎగ్జామ్స్ నిర్వహణకు 755 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అదనంగా మరో ఐదుశాతం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ప్రతీ సెంటర్‌కు లైజనింగ్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌ను కేటాయించారు.

అధికారులు అలర్ట్

గతంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పేపర్ లీక్ కావడంతో.. అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

అన్ని వసతులు సిద్ధం

అన్ని సెంటర్లలో శానిటైజేషన్ పనులు చేపట్టారు. సీసీ కెమెరాలు బిగించి, వాష్ రూమ్‌ల నిర్వహణ, బెంచీలు, టేబుల్స్, ఫ్యాన్లు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విద్యుత్, తాగునీటి తదితర వసతులను కల్పించారు. హెల్త్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో ఇందుకు అవసరమైన యంత్రాలను సమకూర్చారు. ప్రతీ సెంటర్‌లో పోలీసులు, హెల్త్, టెక్నికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వికారాబాద్‌లోని రైల్వే స్టేషన్, బస్టాండు, ఎన్టీఆర్ చౌరస్తాల నుంచి ఆయా సెంటర్ల వద్దకు ఆర్టీసీ బస్సులు నడిపించనున్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

- గ్రూప్- ఫోర్త్ పేపర్- 1 పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగుతుంది.
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్- 2 ఎగ్జామ్ ఉంటుంది.
- పేపర్-1కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 నుంచే సెంటర్లలోనికి అనుమతిస్తారు. 9:45 దాటిన తర్వాత లోపలికి ప్రవేశం ఉండదు.
- సెకండ్ పేపర్ రాసే అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 నుంచి అనుమతిస్తారు. 2:15 తర్వాత ప్రవేశం నిషేధం.
- సీసీ కెమెరాల నిఘాల ఎగ్జామ్స్ కొనసాగుతాయి.
- పరీక్షల ఆరంభం నుంచి పూర్తయ్యే వరకు వీడియో కెమెరాలతో రికార్డు చేస్తారు.
- అభ్యర్థులందరూ విధిగా చెప్పులు మాత్రమే ధరించాలి. షూస్‌కు పర్మిషన్ లేదు.
- హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్‌లు తీసుకువెళ్లాలి.
- ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటివి) కలిగి ఉండాలి.
- హాల్ టికెట్‌పై ఫొటో సరిగ్గా కనిపించని వారు గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో పాటు మూడు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకెళ్లాలి.
- రైటింగ్ ప్యాడ్స్, కాలిక్యులేటర్, మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.
- ఓఎమ్మార్ షీట్‌పై వైట్నర్, చాక్‌పౌడర్, ఎరేజర్, బ్లేడ్ వంటివి వినియోగించకూడదు.
- ఎగ్జామ్ పూర్తయ్యే వరకు అభ్యర్థులెవరూ హాల్ నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతి లేదు.

ఆల్ ది బెస్ట్



పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సెంటర్ల వద్ద వసతులు కల్పించాం. అభ్యర్థులందరూ సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి. ఎగ్జామ్ బాగా రాసి జిల్లాకు మంచి పేరు తేవాలి. ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించాలని.. అందరికీ బెస్ట్ ఆఫ్ లక్.

– నారాయణరెడ్డి, కలెక్టర్



పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

గిరిజనులకు పెద్దపీట

- సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు
- పోడు పట్టాల పంపిణీలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

వికారాబాద్: గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డితో శుక్రవారం పోడు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1,50,012 మంది పోడు రైతులకు ప్రభుత్వం 4,05,601 ఎకరాల భూమి పంపిణీ చేసిందని తెలిపారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన సీఎం మాట నిలబెట్టుకున్నారన్నారు. వంద యూనిట్లలోపు కరెంటు వాడుతున్న ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని వివరించారు. ఓవర్‌సీస్ విద్యా పథకం కింద విదేశీ ఉన్నత చదువుల కోసం ఒక్కో విద్యార్థిపై రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నామని స్పష్టంచేశారు. గిరిజన గురుకులాలు ఏర్పాటు చేసి కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన, వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పోడు పట్టాలు పొందిన రైతులకు వెంటనే రైతుబంధు అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గిరిజన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. గతంలోని ప్రభుత్వాలేవీ తండాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని వివరించారు. పంచాయతీలుగా రూపొందిన పల్లెలు సకల సౌకర్యాలతో అభివృద్ధి పథంలో సాగుతున్నాయని తెలిపారు.

కలలను నిజం చేశారు

జల్ జంగల్ జమీన్ అనే గిరిజన వీరుడు కొమురం భీమ్ నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. చరిత్రలో నిలిచి పోయేలా గిరిజనుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందని స్పష్టంచేశారు.

గిరిజన బాంధవుడు

కనీవిని ఎరగని రీతిలో గిరిజనుల కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చిన సీఎం కేసీఆర్ గిరిజన బాంధవుడిగా నిలిచారని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కొనియాడారు. ఎన్నో సంవత్సరాల గిరిజనుల పోడు హక్కుల కలను నిజం చేశారని తెలిపారు. పోడు పట్టాలు పొందిన రైతులు బ్యాంకుల్లో రుణం పొందడంతో పాటు రైతుబంధుకు అర్హులవుతారన్నారు.

పారదర్శకంగా వ్యవహరించాం

అర్హుల ఎంపికలో అత్యంత పారదర్శకంగా వ్యవహరించామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. 2005 పోడు హక్కుల చట్టం, ఇతర ఫారెస్టు, రెవెన్యూ చట్టాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను సెలెక్ట్ చేశామని స్పష్టంచేశారు. అర్హులైనవారందరికీ హక్కులు దక్కేలా చూశామన్నారు. ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పోడు పట్టాల పంపిణీలో ఇది మొదటి విడత మాత్రమేనని, విడతల వారీగా ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓలు అశోక్‌కుమార్, విజయకుమారి, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీలు లేక సీసీ రోడ్డు పక్కన నిలిచిన వర్షపు నీరు

‘ముంపు’కొస్తోంది..!

- వర్షాకాలంపై తాండూరు వాసుల్లో ఆందోళన
- చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న వార్డులు
- ముంపు ప్రాంతాల నివారణకు చర్యలు శూన్యం
- డ్రైనేజీల క్రమబద్ధీకరణను పట్టించుకోని మున్సిపాలిటీ
- వరద నీటి కాల్వల కబ్జాతో పరిస్థితి మరింత దారుణం

తాండూరు: చిన్నపాటి వర్షం వస్తే చాలు తాండూరు పట్టణంలోని పలు కాలనీలు, జలమయమవుతున్నాయి. రహదారులన్ని కోతకు గురై రాకపోకలు స్తంభిస్తున్నాయి. కొన్ని గల్లీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో నిధులు మంజూరవుతున్నా ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో మున్సిపల్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిలుక వాగు, మోత్కుల వాడుకల ద్వారా మురుగునీటితో పాటు వరద నీరు ప్రవహిస్తాయి. ఇటీవలి కాలంలో రెండు వాగులను కబ్జా చేసి ఇంటి నిర్మాణాలతో పాటు ప్లాట్‌లు చేసి రియల్ వ్యాపారం చేస్తుండటం గమనార్హం.

అభివృద్ధిలో విఫలం

తాండూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 36 వార్డులున్నాయి. సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా కొనసాగుతున్న పట్టణాన్ని అందుకు తగ్గట్లుగా అభివృద్ధి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలున్నాయి. వర్షాకాలం సందర్భంగా గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని.. జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తగా వచ్చిన అధికారులకు పట్టణంపై పూర్తి అవగాహన లేకపోవడంతో ప్రధాన సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోవడం లేదు. హైదరాబాద్ మార్గంలోని రహదారి చిన్నపాటి వర్షానికే కోతకు గురవుతోంది. సాయిపూర్ ప్రాంతమైన 10, 11, 12, 13 వార్డుల్లోని గ్రీన్ సిటీ, మార్కండేయ కాలనీ, కోకట్ వద్ద రోడ్లు ముంపునకు గురవుతున్నాయి. అంతేకాకుండా గొల్ల చెరువు ప్రాంతం, భావిగి భద్రేశ్వరాలయం, ఇందిరాచౌక్ ప్రాంతాల్లోని రహదారులు వరద నీటిలో మునుగుతున్నాయి.

చెరువులు, నాలాలు కబ్జా

కబ్జాల కారణంగా పలు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తుతోంది. పట్టణంలోని మురుగు నీరు చిలుకవాగులో చేరి అక్కడి నుంచి కాగ్నాలో కలుస్తుంది. అయితే పట్టణ శివారులోని హైదరాబాద్ మార్గం నుంచి ప్రారంభమయ్యే చిలుక వాగు పరీవాహక ప్రాంతాన్ని అక్రమార్కులు కబ్జా చేశారు. అక్కడి నుంచి సాయిపూర్ ప్రాంతం, గ్రీన్ సిటీ వరకు చిలుకవాగు కబ్జాకు గురైంది. ఈ విషయంపై పలువురు కౌన్సిలర్లు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు పట్టణంలోని మురుగు కాల్వలను క్రమబద్ధీకరించడంలో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. వీటితో గతంలో వేసిన రోడ్లపైనే సీసీ వేసి నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులన్నీ నామినేషన్ పద్ధతిలో స్థానిక నాయకులకు కట్టబెట్టడంతో అభివృద్ధి జరగడం లేదు. మురుగు కాల్వలను నిర్మించడంలో పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చించోళి మార్గంలోని మోత్కుల వాడుక సైతం కబ్జాకు గురవుతోంది. దీంతో వరద నీరు ఎక్కడికక్కడే నిలిచి, కాలనీలు కుంటలను తలపిస్తున్నాయి.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- 5న మోమిన్‌పేటలోని అంబేడ్కర్ చౌరస్తాకు రండి
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ నేతల సవాల్
- పథకాల అమలుపై చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్
- కేసీఆర్ ప్రభుత్వం, ఎమ్మెల్యేపై విమర్శలను సహించేది లేదని మండిపాటు



మోమిన్‌పేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అనవసర ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, పార్టీ నేతలు సవాల్ విసిరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కర్ణాటక నుంచి వలస వచ్చిన దళిత దొర ప్రసాద్‌కుమార్ అని విమర్శించారు. స్థానికేతరుడైన ఆయనకు.. లోకల్ లీడర్, ఉన్నత విద్యావంతుడైన డాక్టర్ ఆనంద్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ప్రసాద్‌కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో దళితుల అభ్యున్నతికి ఏంచేశారో చెప్పాలని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యల పరిష్కారం, వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేపై చవకబారు ఆరోపణలు చేయడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ కండువా వేసుకున్న వారికే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అందజేస్తున్నారని ప్రసాద్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై ఈనెల 5వ తేదీన మోమిన్‌పేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి నేరుగా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పనితీరు ప్రజలందరికీ తెలుసన్నారు. రాజు బలవంతుడైతేనే రాజ్యంలోని ప్రజలు ధైర్యంగా ఉంటారని, తమ నాయకుడు కేసీఆర్ బలమైన నాయకుడని, వెన్నెముక లేని పార్టీలు, నాయకులకు ఇది అర్థం కాదని ఎద్దేవా చేశారు. తాము తెలంగాణ కోసం ఉద్యమం చేసిన సమయంలో బుగ్గ కార్లలో తిరిగిన ప్రసాద్‌కుమార్‌కు ఉద్యమ గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. స్థానికేతరుడని తెలిసినా ఎమ్మెల్యేగా గెలిపించిన మద్దతుదారులు, నాయకులపై అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనుడు ప్రసాద్‌కుమార్ అని మండిపడ్డారు. ఇకనైనా ఆయన తీరు మార్చుకోకపోతే ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తల నుంచి వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, ఎంపీటీసీ సభ్యుడు కుశాల్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, కాశీరాం, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, మాణయ్య, భిక్షపతి, మహిపాల్, శ్రీరాంలు, మధుసూధన్‌రెడ్డి, చంద్రయ్య, ప్రభు, నర్సింలు, అనంతయ్య, రాజు, ఎల్లారెడ్డి, మైబల్లి, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లి, ధారూరు, అల్లిపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డాట్ సెంటర్ తాండూరు శాస్త్రవేత్త సి.యమున శుక్రవారం పరిశీలించారు. కంది, పత్తి, మిరప సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. సమావేశంలో ఏఈఓలు సంజూరాథోడ్, సుజాత పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త

6నుంచి సమ్మె చేస్తాం



ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ధారూరు: మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల కార్మికులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 6నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లకు కనీస వేతనాలు అందడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికే సమ్మె నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గర్యానాయక్, బోనయ్య, రాజు, సుదర్శన్, లాలయ్య, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వరుణుడు కరుణించాలని రైతుల పూజలు



భజన చేస్తూ పాదయాత్రగా వెళుతున్న రైతులు

బషీరాబాద్: వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదును దాటుతున్నా వర్షాలు కురవకపోవడంతో దేవుళ్లకు పూజలు చేస్తున్నారు. శుక్రవారం బషీరాబాద్ మండలం నీళ్లపల్లి, జలాల్‌పూర్ చెందిన రైతులు గ్రామం నుంచి ఏకాంబరి రామలింగేశ్వర ఆలయం వరకు భజనలు చేస్తూ పాదయాత్ర చేశారు. వరుణదేవుడు కరుణించాలని రామలింగేశ్వరుడికి జలాభిషేకం చేశారు.

పత్తి విత్తనాలను ప్రభుత్వ ధరకే విక్రయించాలి

వికారాబాద్ అర్బన్: బీటీ పత్తి విత్తనాలను భారత ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ, లూజ్ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆమోదం లేని విత్తనాలను విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం నేరమని తెలిపారు. క్రయవిక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. బీజీ- 1 పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.635, బీజీ- 2 విత్తనాల ప్యాకెట్ ధర రూ.853 ఉందని తెలిపారు. రైతులు విధిగా రశీదులు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయించినా, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఎక్సైజ్ అధికారులపై దాడికి పాల్పడిన ఇద్దరికి రిమాండ్



శివరాం, లోక్యానాయక్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

యాలాల: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28న ధారూరు మండలం అంపల్లి ఊరెంటితండాలో సారా కాస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులుతనిఖీలు నిర్వహించేందుకు బయలుదేరారు. ఈనేపథ్యంలో యాలాల మండల పరిధిలోని రాస్నం శివారులో తండాకు చెందిన శివరాం, లోక్యానాయక్ వీరిని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కేసీఆర్‌తోనే ‘గ్రామ స్వరాజ్యం’



జిన్నారంలో పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న సునీతారెడ్డి

బంట్వారం: ప్రతీ పంచాయతీకి ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండలం జిన్నారంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఆమె వెంట కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రకళ, విజయలక్ష్మి, పద్మ, వెంకటేశం, పాండురంగారెడ్డి, జిన్నారం మాజీ సర్పంచ్ మల్లేశం తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు -2023 కోసం జూలై 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు తొలగించండి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని బీమిలీ తండాలో ఐదు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండావాసులు తెలిపారు. తండాకు బషీరాబాద్ నుంచి నీటి సరఫరాచేసే భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిందన్నారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని తండావాసులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం



గోపినాథ్ (ఫైల్)

పరిగి: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గోపినాథ్ (25) అనే వ్యక్తి ఈ నెల 26న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో తండ్రి చందు తిరుపతిరావు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

సీఐ సర్కిల్ కార్యాలయం ప్రారంభం



ధారూరులో సీఐ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ కోటిరెడ్డి

ధారూరు: సీఐ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఎస్పీ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజా సేవలో పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని, పోలీసు సేవలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ సత్యనారాయణ, సర్కిల్ సీఐ అప్పయ్య, ఎస్‌ఐలు సంతోష్‌కుమార్, ఆనంద్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల బాసట




బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న స్నేహితులు

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు ఆర్థిక చేయూతనిచ్చారు. వివరాలు ఇలాఉన్నాయి. మండల పరిధిలోని ఎర్రగోవింద్‌తండాకు చెందిన మొగిలయ్య కొద్ది రోజుల క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మరణించాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి బ్యాచ్‌మేట్స్ (2008–09) తక్షణ సాయంగా రూ.53 వేలు పోగు చేసి స్నేహితుడి భార్యకు అందజేశారు.

అప్పుల బాధ భరించలేక.

మహిళ ఆత్మహత్య



మాధవి (ఫైల్)

పరిగి: అప్పుల బాధ భరించలేక మహిళా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాధవి (32) అనే మహిళ కొన్నేళ్లుగా పరిగి పట్టణంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవలే నూతన ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంటికి చేసిన అప్పులతో పాటు కొన్ని రోజుల క్రితం భర్త రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. భారం మొత్తం తనపై పడడంతో తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మాధవికి ముగ్గురు కుతుళ్లు ఉన్నారని, భర్త రవికాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.



కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో కేంద్ర పథకాలపై కరపత్రాలతో ప్రచారం



అనంతగిరి: వికారాబాద్ మండలంలో బీజేపీ నాయకులు..

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- రాష్ట్ర సర్కారు మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారు
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్
- కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో పర్యటన

కుల్కచర్ల: తెలంగాణలో ఈసారి వచ్చే బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన పార్టీ విస్తారక్ అరసుతో కలిసి ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా మారిందన్నారు. కేంద్రం నిధులతో చేస్తున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం పేరు పెట్టుకోవడం విడ్డూరమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు మహిపాల్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, నాయకులు శరత్‌కుమార్, రాజశేఖర్, రామాంజనేయులు, వెంకట్రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే సుపరిపాలన

అనంతగిరి: దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోనే పారదర్శకమైన పాలన అందుతోందని బీజేపీ జిల్లా కోశాధికారి బస్వలింగం అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి, కొటాలగూడెం, సిద్దులూర్, పీలారం, మైలార్దేవరంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవినీతి, కుంభకోణాలకు తావులేకుండా సాగుతున్న మోదీ పాలనను ప్రతిఒక్కరూ బలపర్చాలని కోరారు. అంతర్జాతీయ వేదికపై భారత్ గ్రాఫ్ పెరగడానికి ప్రధాని తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలే కారణమన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ భారత్‌తో చెలిమికి ప్రయత్నిస్తున్నాయంటే అది మోదీ గొప్పతనమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ స్వాతి, పార్టీ విస్తారక్ డాక్టర్ ప్రీతి లక్ష్మి, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



నర్సింహగౌడ్ (ఫైల్)

కద్తాల్: తాటి చెట్టు పై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చరికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాసు నర్సింహగౌడ్ (55) కుల వృత్తిలో భాగంగా ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ పోలంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారడంతో, నర్సింహగౌడ్ తాటి చెట్టు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా నర్సింహగౌడ్ మృతి చెందాడు. మృతుడికి భార్య రాములమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాసినో ఆడుతున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

మీర్‌పేట: ఆన్‌లైన్ గేమింగ్ (క్యాసినో) ఆడుతున్న ఇద్దరిని మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,85,000 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బద్యానాయక్ కథనం ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వ్యాపారి ఆకుల శ్రీశైలం (27), తుర్కయంజాల్ సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మహేశ్‌గౌడ్ (34) గుట్టుచప్పుడు శుక్రవారం చైతన్యనగర్‌లోని ఓ ఇంట్లో క్యాసినో ఆడుతుండగా సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ బృందం దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,05,000 నగదు, బ్యాంకు ఖాతాలోని రూ.1,20,000, సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వెనుక నుంచి వేగంగా వచ్చి లారీని ఢీకొట్టి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం



లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తమ్మలోనిగూడ గేట్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గన్యాతండాకు చెందిన నేనావత్ వెంకటేశ్(27), నేనావత్ అనిల్(18) గురువారం రాత్రి స్వగ్రామం నుంచి కారులో నగరానికి బయలుదేరారు. మార్గ మధ్యలో రాత్రి 11 గంటల సమయంలో తమ్మలోనిగూడ–తక్కళ్లపల్లి గేట్ల మధ్యన నాయారా పెంట్రోలు పంపు సమీపంలో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు అతికష్టం మీద మృతదేహాలను బయటికి తీశారు. వెంకటేశ్ లిఫ్ట్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. మృతులిద్దరూ దగ్గరి బంధువులు. అదే రాత్రి ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా గ్రామాలను మార్చొద్దు

- మాడ్గులలోనే ఉంచండి
- ఆయా గ్రామస్తుల అభ్యంతరాలు



మాడ్గుల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మండల పరిరక్షణ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: మాడ్గుల మండలాన్ని విభజించి నూతనంగా ఇర్విన్ మండలం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో పలు గ్రామాల ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలను మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని కోరుతున్నారు. తమ గ్రామాల సమస్యలను పరిష్కరించాకే నూతన మండలం ఇర్విన్‌లో కలపాలని చెబుతున్నారు. బ్రాహ్మణపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి, సుద్దపల్లి, అన్నెబోయినపల్లి గ్రామాలను మాడ్గుల మండలంలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పాత బ్రాహ్మణపల్లి గ్రామాన్ని మాడ్గుల మండలంలో ఉంచాలని కోరుతూ సర్పంచ్ పులికంటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అన్నెబోయినపల్లి గ్రామాన్ని మాడ్గులలో ఉంచాలని కోరుతూ సర్పంచ్ పోలె కళ యాదయ్య, నాయకులు సంజీవరెడ్డి, రాంరెడ్డి, వెంకటయ్య తదితరులు కోరుతున్నారు.అందుగుల వాగుపై బ్రిడ్జి నిర్మించిన తరువాతే తమ గ్రామాన్ని ఇర్విన్‌లో కలపాలని అందుగుల సర్పంచ్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. మాడ్గుల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం మాడ్గుల మండల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల విభజన సరిగా చేయడం లేదని, మాడ్గుల మండలంలో 9 రెవెన్యూ గ్రామాలను ఉంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ రాఘవులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పరిరక్షణ కమిటీ నాయకులు గౌని రమేశ్‌గౌడ్, వెంకటయ్య, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, కొత్త బ్రాహ్మణపల్లి సర్పంచ్ జోజమ్మ బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ శౌరిలమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బీటెక్‌లో మార్కులు తక్కువ వస్తాయేమోనని డిప్రెషన్‌కులోనై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ సూరజ్‌నగర్‌లో నివసించే వి.వెంకట్‌రెడ్డి కూతురు సాధన (21) శేరిగూడలోని శ్రీఇందు కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. బీటెక్‌లో మార్కులు తక్కువగా వస్తాయేమోనని మనస్తాపానికి గురై ఈ నెల 13న తను అద్దెకు ఉండే ఇంటి రెండో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర గాయాలైన సాధనను మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలి దుర్మరణం



మృతిచెందిన పార్వతమ్మ

కుల్కచర్ల: చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌కు చెందిన కాకి పార్వతమ్మ(60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తోంది. బుధవారం రాత్రి ఇంటిలో నుంచి వెళ్లిన ఆమె కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం గ్రామ పరిధిలోని అక్కమ్మ చెరువులో పార్వతమ మృతదేహం కనిపించింది. ఆమె కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

శంకర్‌పల్లి: హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దొంతాన్‌పల్లి గేటు వద్ద గల జగదాంబ ఎంటర్ ప్రైజెస్ హార్డ్‌వేర్ దుకాణం యజమాని దలరాం రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం షటర్ తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దుకాణంలో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి ఉన్నాయి. 149 వైర్ల బండిల్స్, 85ఎంసీబీలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.3.5లక్షలు ఉంటుందని తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

- పెద్దూర్‌తండాలో తీవ్ర ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడుతున్న ఏసీపీ కుశాల్కర్

తలకొండపల్లి: తల్లి మందలించిందనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తండావాసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్దూర్‌తండాకు చెందిన నందిని (17) శుక్రవారం అదే తండాకు చెందిన భగ్‌వాన్‌తో ఇంట్లో కనిపించింది. బయటికి వెళ్లి వచ్చిన తల్లి కోమలి ఇద్దరినీ చూసి మందలించింది. అనంతరం పనుల నిమిత్తం బయటికి వెళ్లింది. తల్లి మందలించిందనే మనస్తాపంతో నందిని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కోపోద్రిక్తులై అబ్బాయి ఇంటి ఎదుట మృతదేహన్ని ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో అబ్బాయి కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి పారిపోయారు. దీంతో ఆందోళనకారులు అబ్బాయి ఇంటికి నిప్పు పెట్టారు. రేకుల ఇల్లును ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న బట్టలు, తదితర వస్తువులను కాల్చివేశారు. దీంతో తండాలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్‌తో మంటలార్పారు. ఏసీపీ కుశాల్కర్ నేతృత్వంలో పోలీసులు ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



శ్వేత (ఫైల్)



సంపత్ రావు (ఫైల్)

నందిగామ: తల్లితో కలిసి భోజనం చేసి ఇంట్లో నిద్రపోయిన ఓ యువతి అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన ఘటన మండల కేంద్రమైన నందిగామలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్సై విష్ణువర్ధన్ రెడ్డి కథనం ప్రకారం.. నందిగామకు చెందిన మంగళి పార్వతమ్మ తన కూతురు శ్వేత(19)తో కలిసి గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలోనుంచి లేచి చూసే సరికి శ్వేత కనిపించలేదు. ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారిని సంప్రదించగా ఎక్కడ ఆచూకీ లభించలేదు. పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడు..

పశువుల కొట్టానికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని జంగోనిగూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై విష్ణు వర్ధన్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు.. అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎంబడి లక్ష్మణ్‌కు జంగోనిగూడ గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి ఉండగా అందులో పశువుల కొట్టం ఉంది. అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సంపత్‌రావు తరుణ్ (19) ఎంబడి లక్ష్మణ్ వద్ద రెండేళ్లుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పశువుల కొట్టం వద్దకు వెళ్లిన సంపత్ రావు తరుణ్ గురువారం తెల్లవారు జామున కనిపించలేదు. ఆచూకీ కోసం వెతకగా ఎక్కడ లభించలేదు. దీంతో లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీడ్రైవర్‌పై యువకుల దాడి



గాయపడిన మహ్మద్‌గౌస్

షాద్‌నగర్‌రూరల్: లారీ డ్రైవర్‌పై యువకులు దాడి చేసిన సంఘటన పట్టణ సమీపంలోని హైదరాబాద్ రోడ్డులోగల ఇండియన్ పెట్రోల్ పంపువద్ద ఈ నెల 28న అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథపం ప్రకారం .. ఫరూఖ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ మహ్మద్‌గౌస్ పటాన్‌చెరువు దగ్గరలోని పెన్నా రెసిడెన్షియల్ కంపెనీ నుంచి ఐరన్ లోడుతో బెంగళూరుకు వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో మహ్మద్‌గౌస్ ఈ నెల 28న అర్ధరాత్రి సమయంలో ఐరన్‌లోడుతో బెంగళూరు వెళ్తూ పట్టణ సమీపంలోని ఇండియన్ పెట్రోల్ పంపువద్ద లారీని ఆపుకొని నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో పట్టణానికి చెందిన అభిలాష్, గణేష్, మనోజ్ అక్కడికి వచ్చారు. ఎవరు మీరు, ఇక్కడ అర్ధరాత్రి సమయంలో ఏం చేస్తున్నారని మహ్మద్‌గౌస్ వారిని అడిగాడు. మమ్మల్ని అడిగేందుకు నువ్వు ఎవడివిరా అంటూ నానా బూతులు తిడుతూ దాడి చేశారు. ఈ దాడిలో మహ్మద్‌గౌస్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: తెలంగాణ బిడ్డలు ప్రపంచంలో ఎక్కడైనా పోటీ పడి విజయం సాధించేలా పాఠశాల స్థాయి నుంచే తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. అమేజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆధునీకరించిన మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్‌ను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు అందించారు. సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ చేయూతతో న్యూట్రీషియన్ ఫుడ్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించేలా 9 ఏళ్ల కాలంలో వెయ్యి గురుకులాలు, అదే స్థాయిలో జూనియర్ కళాశాలలు, 90 డిగ్రీ కళాశాలలు, 5 పీజీ, రెండు లా కళాశాలలు గురుకులాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విదేశీ విద్యకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్ సైతం అందిస్తున్నామన్నారు. మన ఊరు–మన బడి పథకం కింద రూ.7 వేల కోట్లు ఖర్చు చేసి ఆధునీకరిస్తున్నామన్నారు. ఆంగ్ల ప్రసంగాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు ప్రణతి, అక్షితను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోట్లు ఖర్చు చేసి అమేజాన్ సంస్థ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం గొప్ప విషయమని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో అమేజాన్ సంస్థ విదేశీ, స్వదేశీ ప్రతినిధులు సాజీ పీకే, కార్నేలియారాబిన్సన్, ఆదిత్యాచౌదరి, స్థానిక సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, వైస్ ఎంపీపీ శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్. సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డీఈఓ సుశీందర్‌రావు, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణారాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలం.. నైరాశ్యం!

కర్ణాటక ఫలితాల తర్వాత నిస్తేజం

- నేతల మధ్య కరువైన సమన్వయం
- ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు వ్యవహారం
- అయోమయంలో పార్టీ శ్రేణులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కర్ణాటక ఎన్నికల్లో ఘోర పరాజయం.. రాష్ట్ర పార్టీలో చోటు చేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు బీజేపీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది. కీలకమైన ఈ సమయంలో పార్టీ నేతలంతా సమన్వయంతో పని చేసి కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపాల్సింది పోయి.. నోటిఫికేషన్‌కు ముందే ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ మరింత పటిష్టంగా వికసించాల్సిన కమలం.. సీనియర్ల తీరుతో క్రమంగా వాడిపోతుండటాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో పార్టీ అంతంత మాత్రంగానే ఉంది. ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పటిష్టంగా ఉన్నప్పటికీ.. సీనియర్ల మధ్య నెలకొన్న అంతర్గత విబేధాలు వచ్చే ఎన్నికల్లో ఆపార్టీ పుట్టి ముంచే అవకాశం లేకపోలేదు. వారంతా ఒక్కతాటిపైకి వచ్చి..కలిసికట్టుగా పని చేస్తే కానీ..ఆయా నియోజకవర్గాల్లో పార్టీ గట్టెక్కడం కష్టమని స్వయంగా పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి.

అయోమయంలో మహేశ్వరం కేడర్..

ఎల్బీనగర్ తర్వాత పార్టీకి గట్టిపట్టున్న మరో నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది మహేశ్వరమే. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లతో పాటు, బడంగ్‌పేట్, మీర్‌పేట్, తుక్కుగూడ మున్సిపాలిటీలు సహా మహేశ్వరం రూరల్ ఏరియాల్లో పార్టీ కేడర్ బలంగా ఉంది. బీజేపీకి జిల్లాలో అత్యధిక స్థానిక ప్రజాప్రతినిధులున్న నియోజకవర్గం కూడా ఇదే. నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి పాలైనా.. 2014 ఎన్నికలతో పోలిస్తే 2018లో ఓటింగ్ శాతాన్ని పెంచగలిగారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇప్పటికే ఆయన గడపగడపకూ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు తూళ్ల వీరేందర్‌గౌడ్, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కూడా టికెట్ ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కృషి చేయాల్సిన సీనియర్లు ఎవరికి వారు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ కేడర్‌ను అయోమయంలోకి నెట్టేస్తున్నారు.

ఆ మూడు నియోజకవర్గాల్లోనే అదే పరిస్థితి

లక్షకుపైగా ముస్లిం ఓటు బ్యాంకు ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనూ బీజేపీ పాగా వేసేందుకు యత్నిస్తోంది. ఇక్కడి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నారు. వీరితో పాటు చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు అంజన్‌కుమార్ కూడా ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా నివసించే శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి రవికుమార్ యాదవ్ సహా సీనియర్ నేత గజ్జెల యోగానంద్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. వీరిలో రవికుమార్ యాదవ్ ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకుని ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఇక బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే సీనియర్ నేతలు కొత్త అశోక్‌గౌడ్, దయానంద్‌గౌడ్, కొప్పు సుకన్య భర్త, బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీకి సై అంటున్నారు.